క్లుప్తంగా

అట్టడుగు కుటుంబాలకు అండగా ఉండండి

సంతమాగులూరు(అద్దంకి): ధనిక కుటుంబాలు అట్టడుగున ఉన్న కుటుంబాలకు ఊతం ఇవ్వాలని అధికారులన్నారు. పీ4 సర్వే అవగాహనలో భాగంగా శుక్రవారం మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన పీఫోర్ సర్వేలో ఉన్నత కుటుంబాలు అట్టడుగున ఉన్న కుటుంబాలకు చేయూతనిస్తే ఆ కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి సాధించి ఉన్నత కుటుంబాలుగా మారుతాయని చెప్పారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

గురిజేపల్లిలో యోగాంధ్ర ర్యాలీ

సంతమాగులూరు(అద్దంకి): మండలంలోని గురిజేపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ గ్రామ పంచాయతీ సెక్రటరీ ఆధ్వర్యంలో శుక్రవారం యోగాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఈ అవగాహన ర్యాలీలో సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ నేర్చుకుని క్రమం తప్పకుండా చేస్తే మానసిక రుగ్మతలు, శారీరక ధృఢత్వం కలుగుతుందని అధికారులు చెప్పారు.

విద్యా మిత్ర కిట్‌ల పరిశీలన


స్టాకు రిజిస్టర్ పరిశీలిస్తున్న జేడీ గంగాభవాని

వేటపాలెం: రైల్వే స్టేషన్ రోడ్డులోగల జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల్లో ఉంచిన రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్‌లను విద్యాశాఖ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన జాయింట్ డైరెక్టర్ ఆర్ఎస్ గంగాభవాని శుక్రవారం పరిశీలించారు. హైస్కూల్‌లో ఉంచిన విద్యార్థులు యూనిఫారమ్స్, బ్యాగ్స్, టెస్ట్ బుక్స్, నోట్ పుస్తకాలు, డిక్షనరీలను ఆమె పరిశీలించారు. అన్ని సక్రమంగా ఉన్నట్లు సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా అధికారి సీఎస్ఓ శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ 2 ఐ. పురుషోత్తం, జి. హరి నారాయణ పాల్గొన్నారు.

పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు


రమణబాబు

అద్దంకి: తనను బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షునిగా నియమించడనికి కృషిచేసిన నియోజకవర్గ సమన్వయ కర్త పానెం చిన హనిమిరెడ్డి, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు బీసీసెల్ అధ్యక్షునిగా నియమితుడైన రమణబాబు శుక్రవారం కృతజ్ఞతలు తెలియజేశారు. శక్తి వంచన లేకుండా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

సీనియారిటీ నిబంధనలు పాటించాలి

● యూటీఎఫ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు


ఎంఈఓకు వినతి పత్రం ఇస్తున్న శ్రీనివాసరావు

వేటపాలెం: ఉపాధ్యాయ బదిలీల్లో ఎస్‌జీటీ సినియారిటీ లిస్టు నిబంధనలు తప్పని సరిగా పాటించి బదిలీలు చేయాలని మండల యూటీఎఫ్ శాఖ ప్రెసిడెంట్ పి. శ్రీనివాసరావు కోరావు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఎస్‌జీటీ సినియారిటీ లిస్టులో నిబందనలకు విరుద్ధంగా జరిగిన బదిలీలను సరిచేయాలిని వినతి పత్రం శుక్రవారం అందించారు. 8 ఏళ్ల నిండిన సరీ్వసు నిండి రియపోర్షన్ పాయింట్స్ ఇవ్వడాన్ని ఎంఈఓతో చర్చించారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ


వలపర్లలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ దృశ్యం

మార్టూరు: మండలంలోని వలపర్ల గ్రామంలో శుక్రవారం శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వలపర్ల, కోనంకి గ్రామాల మధ్య పొలిమేరలో ఉదయం 7.55 గంటలకు బ్రహ్మర్షి డాక్టర్ అన్నదానం చిదంబర స్వామి.. ఇతర వేద పండితుల ఆధ్వర్యంలో ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించారు. 22 అడుగుల ఏకశిలగా రూపొందించిన అభయాంజనేయ స్వామి విగ్రహంతో పాటు, విఘ్నేశ్వర, ఉష్ణ వాహన.. జంట నాగుల విగ్రహాలను భారీ క్రేన్ సాయంతో ప్రతిష్ఠింపజేశారు. పరిసర గ్రామాల నుంచి తరలి వచ్చిన వేలాది మంది భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.


రంగులు వేసిన చిల్డ్రన్స్ పార్కు


విరిగిపోయిన ఊయల

రంగులు వేశారు.. అభివృద్ధి మరిచారు


రంగుల రాట్నం


చిల్డ్రన్స్ పార్కులో పాడైపోయిన జారుడు బల్ల

అద్దంకి రూరల్: అద్దంకి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గత ప్రభుత్వ హయాంలో ఏ ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ పార్కులో చిన్నారులు ఆడుకునే జారుడు బల్లలు, ఊయలలు, రంగుల రాట్నం వంటి పరికరాలు పూర్తిగా పాడైపోయి సంవత్సరం పైగా అయింది. వాటికి మరమ్మతులు చేయించి చిన్నారులకు అందుబాటులోకి తీసుకు రావాల్సింది పోయి, ఆర్భాటంగా యోగా కార్యక్రమాలు నిర్వహించాలన్న అత్యుత్సాహంతో మున్సిపల్ అధికారులు చిల్డ్రన్స్ పార్కులు రంగులు వేశారు. కానీ అందులోని చిన్నారుల ఆడుకునేందుకు పరికరాలు మరమ్మతులు చేయలేదు. అవి బాగు చేయిస్తే పిల్లలు ఆడుకుంటారు కానీ.. ఇలా రంగులు వేయిస్తే ఎవరి ఉపయోగం అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

క్షయ వ్యాధితో జాగ్రత్త


తోటవారిపాలెంలో అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య, క్షయవ్యాధి నిర్మూలన సిబ్బంది

చీరాల రూరల్: క్షయవ్యాధి గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకొని తగిన జాగ్రత్తలు పాటించి క్షయ బారినపడకుండా ఉండాలని ఈపురుపాలెం వైద్యులు డాక్టర్ శ్రీదేవి సూచించారు. క్షయవ్యాధి 100 రోజుల ముక్తి భారత్ అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చీరాల టీబీ యూనిట్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని తోగవారిపాలెం -1 సచివాలలయంలో క్షయవ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీదేవి మాట్లాడారు. క్షయ ఉన్నవారు దగ్గినా, తుమ్మినా ఆయా తుంపర్లు ఇతరుపై పడితే వారికి కూడా క్షయవ్యాధి సోకుతుందని చెప్పారు. హెచ్ఐవీ ఉన్నవారు ఒకరోజు దగ్గినా కళ్లె పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్షయవ్యాధి మన శరీరంలోని ఏ భాగానికైనా సోకుతుందని చెప్పారు. గతంలో టీబీ ఉన్నవారు మందులువాడి తగ్గినా మరలా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లోని వైద్యుల సలహాల మేరకు డాట్ పద్ధతిలో మందులు వాడుకుంటూ మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. క్షయవ్యాధి నిర్మూలన సిబ్బంది కె. శ్రీలక్ష్మి మాట్లాడుతూ ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా జాయింట్ డైరెక్టర్ రమేష్ ఆదేశాల మేరకు జిల్లా అధికారి సాధిక్ మహమ్మద్ పర్యవేక్షణలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కె. లలిత, ఎంఎల్‌హెచ్‌పీ ఎం. మహిజ, ఆశ వర్కర్లు బి. రత్నకుమారి, పి. సుధారాణి, ఎస్ఎస్ఎన్. దీప్తి, 104 సిబ్బంది సుబ్బారావు, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో చెత్త సమస్య పరిష్కారం


కొల్లావారిపాలెంలో చెత్తను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

పర్చూరు(చినగంజాం): మండలంలోని కొల్లావారిపాలెం జగనన్న కాలనీలో చెత్త సమస్య పరిష్కారం అయింది. గడచిన నాలుగు సంవత్సరాలుగా చెత్తను తీసుకొని వచ్చి వేస్తూ కాలనీని డంపింగ్ యార్డుగా మార్చి వేస్తున్నారంటూ కాలనీ వాసులకు ఆందోళన వ్యక్తం చేయడంతో సాక్షి జగనన్న కాలనీపై అక్కసు అంటూ వార్త ప్రచురించింది. దీంతో పంచాయతీ అధికారులు స్పందించారు. కాలనీలోని చెత్తను పంచాయతీ కార్యదర్శి శుక్రవారం తొలగించి కాలనీ వాసుల సమస్యను పరిష్కరించారు. దీనిపై స్పందించిన ఈఓపీఆర్డీ కె. సత్యనారాయణ పంచాయతీ అధికారులకు ఆదేశిలిచ్చి వెంటనే సమస్యను తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న ఎంజీసీ మార్కెట్ అధ్యక్షులు వేముల చంద్రశేఖర్

చీరాల అర్బన్: చీరాల శాఖ గ్రంథాలయంలో 40 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగిసింది. శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిషు కథలు చదివించడం, స్పోకెన్ ఇంగ్లిషు, మ్యూజిక్ తరగతులు, యోగా తరగతులు నిర్వహించారు. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ముగింపు కార్యక్రమానికి ఎంజీసీ మార్కెట్ అధ్యక్షుడు వేముల చంద్రశేఖర్, రిటైర్డు హెడ్మాస్టర్ నీలం శామ్యూల్ మోజెస్, నేతాజీ సేవా సమితి అధ్యక్షుడు చుండూరు కృష్ణమూర్తి, రిటైర్డు బ్యాంకు మేనేజర్ జి.హరిప్రసాద్, మ్యూజిక్ టీచర్ ఆర్.రూపాదేవి హాజరయ్యారు. ఎంతో మంది మహానుభావులు గ్రంథాలయంలో చదువుకొని గొప్పవారయ్యారన్నారు. గ్రంథాలయాలు వలన ఎంతో జ్ఞానం సంపాదించవచ్చని వివరించారు. పిల్లలు చిన్న వయస్సు నుంచే గ్రంథాలయాలకు వెళ్ళడం వలన మంచి క్రమశిక్షణ అలవడుతుందన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి దాతలు మంచాల ప్రసాద్, జూపూడి పూర్ణచంద్రరావు, గుంటూరు వరప్రసాద్‌ల సహకారంతో బహుమతులు అందించారు. అలానే గ్రంథాలయానికి నాలుగు కుర్చీలను బహూకరించారు. గ్రంథపాలకురాలు డి.ధనమ్మ పాల్గొన్నారు.

కడవకుదురులో నేడు విద్యుత్ సరఫరా బంద్

చినగంజాం: మండలంలోని కడవకుదురు గ్రామంలో కొత్త లైన్ వర్క్ జరుగుతున్న కారణంగా 7 వ తేదీ శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పడవల గణనారాయణ తెలిపారు. గ్రామంలో మధ్యాహ్నం 2 గంటలు నుంచి మధ్యాహ్నం సాయంత్రం 6 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు. వ్యవసాయానికి త్రీ ఫేజ్ కరెంటు ఉదయం 5 గంటలకు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. గ్రామ ప్రజలు తమకు సహకరించాలని కోరారు.

శింగరకొండ దర్శిని


ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం వైశాఖ మాసం చిత్త నక్షత్రం ద్వాదశి తిథి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శుక్రవారం తెలిపారు. శనివారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం బిందె తీర్థ, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీసురవ్వలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

బక్రీద్ శుభాకాంక్షలు



పర్చూరు: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గాదె మధుసూదన్ రెడ్డి ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, సహనం, ఐకమత్యానికి ప్రతీకగా బక్రీద్ నిలుస్తుందన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం స్ఫూర్తితో ప్రజలు సత్యం, న్యాయం, ధర్మం, త్యాగం, సహనం, పరోపకారం, బాధ్యతాభావం అలవరచుకోవాలని కోరారు.

50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు


రైతులతో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి సుమతి

చీరాల రూరల్: ఖరీఫ్ సీజన్‌లో సాగుకు సమాయత్తమయ్యే రైతులు 50 శాతం రాయితీతో అందించే పచ్చిరొట్ట విత్తనాలను కొనుగోలు చేసి పొలంలో చల్లి పంట దిగుబడులు పెంచుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎ. సుమతి పేర్కొన్నారు. సాగుకు సమాయత్తం కార్యక్రమాన్ని శుక్రవారం మండల పరిధిలోని గవినివారిపాలెం, కావూరివారిపాలెం గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో సుమతి రైతులనుద్దేశించి మాట్లాడారు. సాగుకు సమాయత్తమయ్యే రైతులకు కేడబ్ల్యూడీ కాలువ నుంచి సాగునీరు విడుదల చేస్తున్న నేపథ్యంలో పొలాల గట్లు, పంట కాలువల గట్లను రైతులు పటిష్ఠం చేసుకొని నీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పంటపొలాల దుక్కులను దున్నుకున్నట్లయితే నీరు భూమిలోకి ఇంకి నీటి నిల్వలు పుష్కలంగా ఉంటాయని చెప్పారు. పంటల అవశేషాలు భూమిలో కుళ్లి ఎరువులుగా మారతాయని చెప్పారు. అలానే అందుబాటును బట్టి చెరువు మట్టిని పొలంలో కలియదున్నుకున్నట్లయితే పంటల దిగుబడి బాగుంటుందని చెప్పారు. రైతులు ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని పంటలు దిగుబడి సాధించాలని సూచించారు. అలానే పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ పథకంలో రైతులంతా వారి వివరాలరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. రైతుల వివరాలను ఆర్ఎస్‌కేలో లేనిచో మరలా పొలం పాస్‌బుక్, ఆధార్ కార్డుతో పాటు ఒక అర్జీని అందచేసి ఆర్ఎస్‌కేలో రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు. వీఏఏలు హదస్సా, లావణ్య, రైతులు పాల్గొన్నారు.

చెరువు కట్ట మట్టి తరలింపు


మట్టి తవ్విన చెరువు కట్ట

అద్దంకి: కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూటమి, నాయకులు, సానుభూతిపరులు చెరువుల్లో మట్టి, ఇసుక తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఈ క్రమంలో గత రెండు మూడు రోజుల నుంచి మండలంలోని జార్లపాలెం గ్రామంలోని ఎండోమెంట్ చెరువులో టీడీపీకి చెందిన సానుభూతిపరులు చెరువులో నీరుండటంతో ఏకంగా చెరువు కట్టనే పొక్లెయిన్‌తో ట్రాక్టర్లకు ఎత్తి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా దేవాదాయ శాఖ అధికారులు పట్టించుకుని మట్టి తరలింపును అడ్డుకోకపోతే చెరువులో నీరు నిలవకపోగా, ఆ నీరు చుట్టుపక్కల గృహాలను ముంచెత్తుతుందని గ్రామస్తులు వాపోతున్నారు.

దోమల వ్యాప్తి అరికట్టండి


పెదగంజాంలో పీఎంజేఏవై కార్డులను పంపిణీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

చినగంజాం: రోగాలకు మూల కారణం అవుతున్న దోమలను అరికట్టడంలో ప్రజలంతా పాల్గొనాలని చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి పి. సాయి శ్రీ చరణ్ అన్నారు. మండలంలోని పెద గంజాం గ్రామంలో ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన కార్యక్రమం నిర్వహించి 525 మందికి కొత్తగా కార్డులు, ఈకేవైసీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ టీబీ రహిత సమాజం కోసం హైరిస్కు ప్రజలు కళ్ళె పరీక్ష చేయించుకోవాల్సిందిగా తెలియజేశారు. మలేరియా మసోత్సవం సందర్భంగా ప్రతి శుక్రవారం రోజు ఫ్రైడే.. డ్రై డేను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నీటి నిల్వలు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో భాగస్వామ్యులై దోమల వ్యాప్తి నిర్మూలన కార్యక్రమంలో పాలు పంచుకోవాలని కోరారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా చిన్నచిన్న వ్యాధులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎన్. కృష్ణ, కార్యదర్శి కె. కృపారావు, బాపట్ల నుంచి టీం లీడర్ కె. సుజిత, కె. ప్రభాకర్, ఏ. రాజశేఖర్, కె. బోయేజ్, కె. రాంబాబు, టి. అనిల్ కుమార్, టి. ఫణి, జి. మౌనిక, హెల్త్ సూపర్‌వైజర్ చిరంజీవి, పొదిలి రాఘవ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

గేటు దాటేదెలా సారూ..!


మున్నం వారిపాలెం రైల్వే గేటు వద్ద ఎత్తుగా ఉన్న ప్రాంతం


ట్రాక్‌పై గులకరాళ్ళు లేచి ఇబ్బందులకు గురవుతున్న వాహనదారులు

చినగంజాం: మండలంలోని మున్నంవారి పాలెం గ్రామం రైల్వే గేటు దాటి వెళ్ళేందుకు వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. రైలు ట్రాక్‌పై రాళ్ళు లేచి ఉండటంతో వాహనాలు ట్రాక్ దాటుకొని వెళ్ళేందుకు వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రైల్వే గేటు వద్ద ట్రాక్ మరమ్మతులు జరిగి సుమారు రెండు నెలలు దాటినా రైల్వే అధికారులు వాహనాలు దాటి వెళ్ళేందుకు సౌకర్యవంతంగా ట్రాక్ మరమ్మతులు చేపట్టక పోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాళ్ళు విపరీతంగా లేచి ఉండటంతో వాహనదారులు జారి పడిపోతున్నారు. ట్రాక్ మీద రాళ్ళపై వాహన దారులు జారి పడటంతో గాయాల పాలవుతున్నారు. అదే విధంగా తూర్పు గేటు వైపు ఉన్న సిమెంట్ ప్లాట్ ఫాం వద్ద రోడ్డు లెవెల్ కన్నా ఎత్తులో ఉండటంతో వాహన దారులు అసౌకర్యానికి గురవుతున్నారు. రైల్వే అధికారులు నిర్లక్ష్యం కారణంగా తాము తీవ్రంగా అసౌకర్యానికి గురవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు పట్టించుకొని ట్రాక్ వద్ద గులక రాళ్ళను చదరం చేసి వాహనాలు దాటి వెళ్ళేందుకు అనుకూలంగా చేసి రాకపోకలకు మెరుగైన సౌకర్యం కలిగించాలని కోరుతున్నారు.

ప్రతిభా పురస్కారాలు కైవసం చేసుకున్న విద్యార్థులు


నల్లగొర్ల హర్షిత


తేళ పునీత్ సాయి

పర్చూరు(చినగంజాం): స్థానిక శాతవాహన హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు ఎంపికైనట్లు ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో నల్లగొర్ల హర్షిత (596), తేళ్ళ పునీత్ సాయి(592) మార్కులు సాధించడంతో వారు ప్రభుత్వం అందజేసే ప్రతిభా పురస్కారాలకు అర్హత సాధించారు. ప్రతిభా పురస్కారాలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది. వీరిరువురు ఈ నెల 9 వ తేదీన కలెక్టర్ జె. వెంకట మురళి చేతుల మీదుగా పురస్కారాలను అందుకోనున్నట్లు ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తేళ్ళ వెంకట రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా అవార్డులకు విద్యార్థుల ఎంపిక

బల్లికురవ: గత విద్యా సంవత్సరం మార్చిలో నిర్వహించిన పదో తరగతిపరీక్షల్లో మండలంలో అత్యధిక మార్కులు తెచ్చుకున్న ఆరుగురు ప్రభుత్వ విద్యార్థులు ప్రతిభా అవార్డులకు ఎంపికయ్యారు. కొప్పరపాడు పాఠశాల నుంచి కంభాల నాగసాయి చరణ్‌తేజ 590 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచాడు. అదే పాఠశాల నుంచి మాదాల హేమ స్రవంతి 586 మార్కులు సాధించి రెండో స్థానంలో నిలిచింది. కొమ్మినేనివారిపాలెం నుంచి షేక్ సుహాన 576 మార్కులు, బల్లికురవ నుంచి దాసరి రమ్యశ్రీ 571 మార్కులు, కూకట్లపల్లి నుంచి పోట్లూరి స్వప్న 550 మార్కులు, వైదన నుంచి గుర్రాల వైష్ణవి 549 మార్కులు సాధించగా వీరందరూ ప్రతిభా అవార్డులకు ఎంపికయ్యారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకుడు చేతుల మీదుగా అవార్డు పారితోషికం అందుకోనున్నారు.

ఎన్ఎంఎంఎస్ టెస్ట్‌లో 17వ ర్యాంక్


లలిత్ సాయి విఘ్నేష్

వేటపాలెం: పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఏనిమిదో తరగతి చదువుతున్న బట్ట లలిత్ సాయి విగ్నేష్ కి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్షిప్ టెస్ట్ ఫలితాల్లో జిల్లా స్థాయిలో 17వ ర్యాంక్ సాధించాడు. మండల పరిధిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. విద్యార్థుల్లో ఆర్థికంగా వెలనక బడిన వారిని ప్రోత్సహించేందుకు జాతీయ స్థాయిలో జరిగే ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఏడాదికి రూ.12 వేలు చొప్పున 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు నగుదు ప్రోత్సాహం అందిస్తారు.

పంగులూరు మండలానికి ఐదు ప్రతిభా అవార్డులు

జె.పంగులూరు: పంగులూరు మండలంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి 10 వ తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతిభా పురస్కార అవార్డులకు ఎంపికయ్యారు. ఈ మేరకు పంగులూరు మండల విద్యాశాఖ అధికారి కె. నాగభూషణం, జి. వీరాంజనేయులు శుక్రవారం తెలిపారు. గత మార్చి నెలలో జరిగిన 10 వ తరగతి పరీక్ష ఫలితాల్లో కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎండ్లూరి సుమన శ్రీ (578), చందలూర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కట్టా హరిక (590), జిర్రా మణిదీప్ రెడ్డి (586), బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన భవనం భవ్య (585), జి. మురళీ కృష్ణ సాయిరాం (580) ఎంపికైయారని తెలిపారు. వీరికి త్వరలో జరగనున్న కార్యక్రమంలో ప్రతిభ పురస్కారాలు అందికారు అందించనున్నారని తెలిపారు.